# చిన్నన్నయ్యా

ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటలో ఆగింది.

"టీ తాగొద్దాం పద" అన్నాడు హకీం.

చేతి గడియారం వంక చూసుకున్నాను. తొమ్మిదీపది అయింది.

"బండి ఇక్కడ ఎంతసేపు ఆగుతుంది?" అడిగాను.

"పది నిముషాలు" అని, లేచి నిలబడ్డాడు.

మా సూట్‌కేస్‌లు తోటి ప్రయాణికుడిని చూస్తుండమని చెప్పి, బండి దిగి టీ స్టాల్ వైపు నడుస్తుంటే, "చిన్నన్నయ్యా" అని మా వెనకనుండి పిలుపు వినిపించింది. ఆగాను. మా ఇంట్లో నేను రెండోవాడిని అవటాన మా తమ్ముళ్లు నన్ను 'చిన్నన్నయ్యా' అని పిలుస్తుంటారు. వెనక్కి తిరిగి చూశాను. ముప్ఫై సంవత్సరాల వ్యక్తి త్వరత్వరగా నా దగ్గరకు వచ్చాడు. సన్నగా, చామనచాయలో ఉన్నాడు. అతన్ని మునుపు ఎప్పుడూ చూడలేదు.

"చిన్నన్నయ్యా, ఎలా ఉన్నావు?" నా చేయి అందుకుని తన చేతుల్లోకి తీసుకుంటూ ఎంతో ఆప్యాయంగా అడిగాడు.

అతను ఎవరో నాకు గుర్తు రావటం లేదు.

"నాలుగేళ్లయింది నిన్ను చూసి, నువ్వు ఈ బండిలో శ్రీకాకుళం వెళ్తున్నావని నీ స్నేహితుడు రాఘవులు నాలుగు రోజుల కిందట కనిపించి చెప్తే కలుద్దామని వచ్చాను. నిన్ను చూస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. వదినా, పిల్లలూ ఎలా ఉన్నారు? ఈ మధ్యలో గుంటూరు వెళ్ళొచ్చావా? పెద్దన్నయ్య, అమ్మా నాన్నలు ఎలా ఉన్నారు?" అంటూ ప్రశ్నలు వేస్తుంటే అడ్డుతగిలి, "సారీ... మీరు?" ఆగి అతని ముఖంలోకి పరీక్షగా చూసి, "మీరు నాకు గుర్తు రావటంలేదు..." అన్నాను.

హఠాత్తుగా అతని ముఖం వివర్ణమయింది. నేను చెప్పింది నమ్మనట్టు తల చిన్నగా అడ్డంగా ఆడించాడు. కళ్ళలో నీళ్లు కదిలాయి. "నేను చిన్నన్నయ్యా, పాపాజీని... నా మీద ఇంకా కోపం పోలేదా?" దీనంగా అన్నాడు.

ఏం మాట్లాడాలో వెంటనే తోచలేదు. అతని భుజం మీద చేయివేసి, "మీరు పొరబడ్డారు. నేను మీ చిన్నన్నయ్యను కాదు. నా పేరు ప్రసాద్. హైదరాబాద్‌లో పనిచేస్తున్నాను. ఇతను నా కొలీగ్ హకీం. మేమిద్దరం ఆఫీసు పనిమీద కలకత్తా వెళ్తున్నాం" అన్నాను.

అని నా జేబులోంచి మా కంపెనీ ఐడెంటిటీ కార్డు తీసి చూపించాక గాని అతను నా మాటలు నమ్మలేకపోయాడు. నవ్వి, "నిజం. నేను మా ఆవిడతో తప్ప ఎవరితోనూ అబద్ధాలు చెప్పను" అన్నాను.

అతను కన్నీళ్లు తుడుచుకుంటూనే నవ్వి, "క్షమించండి. నేను పొరబడ్డాను. మా చిన్నన్నయ్య ముమ్మూర్తులా మీలానే ఉంటాడు, కళ్లజోడుతో సహా" అన్నాడు.

నావి భూతద్దాల కళ్లజోడు.

"మనిషిని పోలిన మనుషులు ఏడుగురుంటారని ఎప్పుడో చదివాను. నన్ను మా ఇంట్లో చిన్నన్నయ్యా అని నా తమ్ముళ్లు పిలుస్తుంటారు. రండి, టీ తాగుదాం. మీరేం చేస్తుంటారు?" అడిగాను.

"అవంతి టెక్స్‌టైల్స్‌లో పనిచేస్తున్నాను"

"మీ పేరు?"

"అరుణారావు. మా ఇంట్లో నన్ను 'పాపాజీ' అని పిలుస్తుంటారు".

మొదట్లో అతను మోసగాడేమోనని అనుకున్నాను గాని టీ తాగుతూ అతని గురించి మరికొన్ని వివరాలు తెలుసుకున్నాక అతన్ని అనుమానించినందుకు నొచ్చుకున్నాను. అవంతి టెక్స్‌టైల్స్ పర్చేస్ మేనేజరు నాకు బాగా తెలుసు. మా కంపెనీకి వాళ్లు కస్టమర్స్. అందులో నాకు తెలిసిన వాళ్లు నలుగురయిదుగురు పనిచేస్తున్నారు. వాళ్ల గురించి అడిగినప్పుడు కూడా అరుణారావు సరయిన సమాధానాలే చెప్పాడు. టీ తాగాక హకీం డబ్బులివ్వబోతుంటే అతన్నివ్వనీకుండా వారించి, అరుణారావే డబ్బులిచ్చాడు. ముగ్గురం కంపార్ట్‌మెంట్ దగ్గిరకొచ్చి నిలబడ్డాం.

"శ్రీకాకుళంలో మీ చిన్నన్నయ్య ఏం చేస్తుంటారు?" అడిగాను.

"స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు సంవత్సరాల కిందటి వరకు హైదరాబాద్ హెడ్ ఆఫీసులో పనిచేసేవాడు."

"ఆయన పేరు?"

"గంగాధర్. మీ వయసే ఉంటుంది. సొంత ఇల్లు సంజీవరెడ్డి నగర్‌లో ఉంది. మా వదిన, పిల్లలు హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. నెలా పదిహేను రోజులకో, రెండు నెలల కొకసారో శ్రీకాకుళం నుండి వచ్చి వెళ్తుంటాడు. ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం

చేస్తున్నాడు. మేం ముగ్గురన్నదమ్ములం. పెద్దన్నయ్య గుంటూరులో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు."

"మీరంటే మీ చిన్నన్నయ్యకు ఎందుకు కోపం?"

"అయిదు సంవత్సరాల కిందట మా చెల్లెలు పెళ్ళిచేసినప్పుడు అన్నయ్య లిద్దరూ తలా కొంత డబ్బులు వేసుకుని నా భాగంగా పదివేలు ఇమ్మన్నారు. రోజువారీ పని చేస్తున్న నాకు అది ఎక్కువే. ఇవ్వలేకపోయాను. నా బదులు చిన్నన్నయ్య ఆ డబ్బు సర్ది మూడు నెలల్లో తిరిగి ఇమ్మన్నాడు. అదీ ఇవ్వలేకపోయాను. అందుకనే నేనంటే కోపం. నా అసహాయత ఆయనకు తెలుసు కాని మా వదిన ఒప్పుకోవటం లేదు. ఆయన మా వదిన మాట జవదాటడు. వాళ్ల మాటలు, చిన్న చూపులు తట్టుకోలేక నన్ను నేను వెలివేసుకున్నాను. నాలుగు రోజుల కిందట చిన్నన్నయ్య ఈ రోజు ఈ బండిలో వెళ్తున్నాడని తెలిశాక నేను కాజీపేట స్టేషన్‌లో ఆయన్ని కలుస్తానని ఉత్తరం రాశాను. అందే ఉండాలి.

"మా చిన్నన్నయ్యంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని చూసి మాట్లాడి వెళ్దామని ఎంతో ఆశతో వచ్చాను. ఈవేళ ఆయనకు వీలుపడి ఉండక పోవచ్చునేమో.... " మాటల్లో బాధ ధ్వనించింది.

బండి కదలబోతుంటే నేనూ, హకీం బండి ఎక్కి తలుపు దగ్గర నిలబడ్డాం. "మళ్ళీ కలుద్దాం" అన్నాను.

"ఎలా?"

"మీ ఫేక్టరీకొస్తాను."

"తప్పకుండా రండి." కుడిచేతిని గాలిలో ఊపుతుంటే బండి వేగం పుంజుకుంది. అరుణారావు కనుమరుగయ్యాడు.

"పద. సీట్లో కూర్చుందాం" అన్నాడు హాకీం.

"నువ్వెళ్లు. సిగరెట్ తాగి వస్తాను."

హకీం వెళ్లి సీట్లో కూర్చున్నాడు. తలుపు వేసి గడియ పెట్టి సిగరెట్ వెలిగించాను. టాయ్‌లెట్ తలుపు తెరుచుకుంది. కాజీపేట స్టేషన్ దగ్గరవుతుండగా అతను టాయ్‌లెట్‌లోకి వెళ్లినట్టు గుర్తు. అప్పుడతన్ని నేను సరిగ్గా గమనించలేదు. ఇప్పుడతను నా పక్కగా వెళ్తోంటే పరీక్షగా చూశాను. అతను ముమ్మూర్తులా నాలానే ఉన్నాడు.

◆ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7 మార్చి 1996